

KADILIMCHE VAARTHA Telugu daily

కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 248 సోమవారం 07 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar


# సీట్ల పంపకాలపై ఉత్కంఠ



- మున్సిపల్ ఎన్నికల్లో 80:15:5 ఫార్ములా
- టీడీపీ, బీజేపీ, జనసేన నాయకత్వాల్లో తర్జనభర్జన
- ఎక్కువ స్థానాలు కావాలని జనసేన పట్టుబట్టే అవకాశం
- వైఎస్సార్‌సీపీకి అగ్ని పరీక్షే
- చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల స్థాయిలో తుది నిర్ణయం తీసుకోనున్నారు

**అమరావతి**

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసి విజయం సాధించిన టీడీపీ-బీజేపీ-జనసేన (కూటమి/ఎన్‌డీఏ) మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నాయి. అయితే సీట్ల పంపకం మీద ఇరుపార్టీల నేతల్లో చర్చలు సాగుతున్నాయి. టీడీపీలో 80:15:5 (టీడీపీ:జనసేన:బీజేపీ) ఫార్ములా ప్రస్తావన ఉంది. అయితే ఇంకా ఖరారు కాలేదు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల స్థాయిలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఈ ఎన్నికల్లో జనసేన మరిన్ని సీట్లు (ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు) కోరుతోంది. బీజేపీ కూడా విశాఖ, రాజమహేంద్రవరం - మిగతా3లో

# కుప్పకూలిన హాస్టల్ భవనం

- ఐదుగురు మృతి- శిథిలాల కింద పలువురు-
- అమిత్ షా గోవా పర్యటన రద్దు
- ఢిల్లీ ఆర్‌కేపురంలోని సత్యనికేతన్ ప్రాంతంలో కూలిన హాస్టల్ భవనం
- సహాయ చర్యల్లో పాల్గొన్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, డీడీఎంఏ, ఎన్‌డీఆర్ఎఫ్





## ఐరాస వరల్డ్ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్, లద్ధాఖ్

- భారత్ అధికారిక పటాల ప్రకారమే ఉండాలి
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను భారత అధికారిక పటం ప్రకారమే చూపాలని భారత్ స్పష్టీకరణ
- తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణ తమకు ఆమోదయోగ్యం కాదని వెల్లడి

## స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు



- వడివడిగా ఏర్పాట్లు
- వచ్చే ఏడాది ఘనంగా గోదావరి పుష్కరాలు
- 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- పాత రేవుల మరమ్మతులు, కొత్త రేవుల నిర్మాణం

**అమరావతి**

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకల కోసం 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' అనే పేరుతో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రభుత్వం అదనపు నిధులను కూడా కేటాయించింది. పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల సమన్వయంతో ముందుగా స్నానఘట్టాల (రేవుల) ప్రక్షాళన, కొత్త రేవుల నిర్మాణ పనులను - మిగతా3లో

# పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

- డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం
- 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యం!
- "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం
- 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం : కేంద్ర హోంమంత్రి అమిత్ షా



# పొగాకు రైతులకు భరోసా



- 'నో--బిడ్'లు తగ్గుముఖం.. కొనుగోలుదారుల పోటీతో మెరుగవుతున్న ధరలు
- వేలం కేంద్రాలను నిరంతర పర్యవేక్షణః మంత్రి అచ్చెన్నాయుడు
- రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు
- సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో 2025--26 ఎఫ్‌సీవీ పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు - మిగతా3లో



## విద్యార్థుల గొంతు వినండి

- లేదంటే 'ఛత్రోం కీ గూంజ్' తీవ్రమవుతుంది: రాహుల్
- మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థుల నిరసనలపై రాహుల్ గాంధీ స్పందన
- పేపర్ లీకులు, నిలిచిపోయిన నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీత
- ఎంపీఎస్‌సీ విశ్వసనీయతను దెబ్బతీశారంటూ బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణ

# ఏపీ పర్యాటకానికి మహర్దశ

- రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకాల్లో రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా
- అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఆమోదం
- ప్రాజెక్టుల పనులకు త్వరలో టెండర్లు పిలవనున్న ప్రభుత్వం
- స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకాల్లో రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా



**అమరావతి**

ప్రకృతి సోయగానికి నిలువుటద్దం పట్టే కొండ కోనలు, సహజసిద్ధ జల పాతాలు, నదుల పరవళ్లు, విశాల సముద్ర తీరం, ప్రఖ్యాత పుణ్యక్షేత్రా లు, వైభవాన్ని చాటే చారిత్రక ప్రదేశాలు, వారసత్వానికి ప్రతీకైన కోటలు ఇలాంటి విభిన్నమైన పర్యాటక ప్రాంతాల సమాహారం ఆంధ్రప్రదేశ్. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల గొప్పతనాన్ని అందరికీ పరిచయం చేసేలా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం. ఈ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవడంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఇటీవలి కాలంలో ఈ దిశగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతుండటంతో పర్యాటక ప్రాంతాల్లో వసతులు మెరుగవుతు న్నాయి. తాజాగా స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ.419.30 కోట్లతో అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనుంది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ.152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి - మిగతా3లో



## ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

- అందనంత దూరంలో మీరు
- అందుకే ప్రచారాలు అవసరం
- మోదీపై ఖర్గే విమర్శలు
- ప్రధాని మోదీ 'యాంగ్రీ అంకుల్' వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్

# 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు'



-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రవహించే అఖండ గోదావరి, వశిష్ఠ, గౌతమి నదులకు కుడి, ఎడమ వైపున పుష్కర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడ ఉన్న 238 పాత రేవులకు అవసరమైన మరమ్మతులు చేయనున్నారు. వీటితో పాటు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 16 రేవులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులన్నింటి కోసం రూ. 210.05 కోట్ల అంచనాతో అధికారులు టెండర్లు పిలిచారు.

**తాగునీటి సదుపాయాలు**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం జిల్లాల పరిధిలో రూ.90 కోట్లతో 7 నియోజకవర్గాల్లో మొత్తం 111 రోడ్లను నిర్మించనున్నారు. అలాగే, రేవుల వద్ద భక్తుల కోసం రూ.10 కోట్లతో తాగునీటి సదుపాయం కల్పిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 30కి పైగా సిమెంటు, తారురోడ్ల నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల గుండా వశిష్ఠ గోదావరి ప్రవహిస్తోంది. ఇక్కడ తొలి దశలోనే రూ. 30 కోట్లకు పైగా ఖర్చు చేసి 34 రేవుల పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం 20కి పైగా గ్రామాల పరిధిలోని స్నానాల రేవులు వరద మేటలతో నిండిపోయాయి. పెదమల్లం లాంటి ప్రాంతాల్లో అయితే రేవులు పూర్తిగా పూడిపోయాయి. ప్రధానమైన నరసాపురం, దొడ్డిపట్ల, సిద్ధాంతం, కోడేరు రేవుల వద్ద మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. ఈ సమస్యలన్నింటినీ పుష్కరాల నాటికి పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**నవంబర్‌లో పనులు ప్రారంభం**

పుష్కరాల్లో స్నానాల రేవుల నిర్మాణమే కీలకం కాబట్టి ఈ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగియనుందని ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ జేఈలు సుధాకర్, పవన్‌కుమార్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే నవంబర్ నెలలో పనులను ప్రారంభిస్తామని వారు వెల్లడించారు.

## రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు నరకం

# కనీస వసతులు కరవు



రైల్వే రంగంలో ఎంతో సాంకేతికత పెరిగింది. రైళ్లు, స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో ప్రయాణికులకు మాత్రం కష్టాలు తీరడం లేదు. రాయదుర్గం, కల్యాణదుర్గం గ్రామీణం, గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు తదితర రైల్వే స్టేషన్లలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.

**తాగునీరు, మరుగుదొడ్లు కరవు**

చాలా స్టేషన్లలో ప్రయాణికులు కూర్చునేందుకు కనీసం బెంచీలు లేవు. మరుగుదొడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొన్నిచోట్ల మరుగుదొడ్లకు తాళాలు వేశారు. అధికారులను అడిగి తాళాలు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. తాగునీటి కోసం పైపులు వేసినా వాటికి కుళాయిలు బిగించలేదు. కొన్నిచోట్ల ఉప్పు నీరు వస్తోంది. ప్లాట్‌ఫారాలపై నిర్మించిన నీటి తొట్టెలు ధ్వంసమైనా మరమ్మతులు చేయడం లేదు. కనీసం అవసరమైన దుకాణాలు కూడా అందుబాటులో లేవు.

**ప్లాట్‌ఫారాలపై అగచాట్లు**

చాలా స్టేషన్లలో ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు తలదాచుకునేందుకు కనీసం షెల్టర్లు లేవు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రైళ్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు ప్లాట్‌ఫారాల విస్తరణ, నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారానికి వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లేవు. కొన్నిచోట్ల పై వంతెనలు నిర్మించినా అవి ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రయాణికులు ప్రాణాలకు తెగించి పట్టాలు దాటుతున్నారు. రైల్వే స్టేషన్లలో వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు తప్పడం లేదు. దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించినా, వారికి అవసరమైన వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచలేదు. పై అంతస్తులకు లేదా వేరే ప్లాట్‌ఫారం మారేందుకు లిఫ్టుల సౌకర్యం లేదు. దీంతో వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు ఎత్తైన మెట్లు ఎక్కలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**శివారు స్టేషన్లు**

కొన్ని రైల్వే స్టేషన్లు పట్టణ శివారులో ఉన్నాయి. దీంతో ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకోవడం చాలా కష్టంగా మా రింది. దీనికి తోడు రైల్వే అధికారులు తరచూ రైళ్లను శివారు ప్లాట్‌ఫారాలపై ఆపుతున్నారు. ప్రయాణికులు అక్కడికి చేరుకు నేలోపే దుండగులు ఆసరాగా తీసుకుని చోరీలకు పాల్పడుతు న్నారు. ప్రయాణికుల భద్రత గాలిలో కలిసిపోతోం ది. ఇప్పటి కైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# సుదీర్ఘ పాదయాత్రకు జగన్




**కడప :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే. ప్రతిపక్ష నేతగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను, విశ్వసనీయతను చూపించగలిగితేనే పాదయాత్ర సక్సెస్ అవుతుంది. పాత ఫార్ములానే నమ్ముకోకుండా, సరికొత్త హామీలతో, పొరపాట్లను సరిదిద్దుకుంటూ జగన్ ప్రజల్లోకి వెళితేనే ఈ పాదయాత్ర 2.0 వైసీపీని మళ్లీ రేసులోకి తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి

## సీట్ల పంపకాలపై ఉత్కంఠ

-మొదటిపేజీ తరువాయి

మేయర్ సీట్లు కోరుతోంది. వైఎస్సార్‌సీపీ ఒక్కో సీటుపై పోరాడనున్నట్టు సిద్ధమవుతోంది. అయితే ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి అగ్ని పరీక్షగా మారనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు) ఎన్నికలకు సర్కార్ కీలక ముందడుగు వేసింది. శనివారం (సెప్టెంబర్ 5, 2026) ప్రభుత్వం కొత్త స్టాట్యూటరీ రూల్స్, జీవోలు జారీ చేసిన విషయం తెలిసిందే. మున్సిపల్ సవరణ చట్టం--2026 (ఆగస్టు 28 నుంచి అమలు) ప్రకారం మేయర్లు, చైర్‌పర్సన్‌లను ఇక ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి. గతంలో కౌన్సిలర్లు ఎన్నుకునే విధానం మారింది. ప్రస్తుతం పూర్తి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. అయితే సన్నాహాలు వేగంగా సాగుతున్నాయి. అక్టోబర్‌లో ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ వచ్చి, అక్టోబర్‌లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. కొన్ని నివేదికల్లో డిసెంబర్‌లోగా ప్రక్రియ పూర్తి చేయాలని కూడా ప్రస్తావన ఉంది.

**ప్రస్తుత షెడ్యూల్ వివరాలు:**

సెప్టెంబర్ 8 నుంచి 21 వరకు 59 యూఎల్‌బీల్లో (విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ సహా 58 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు కోసం 14 రోజుల ప్రక్రియ.

సెప్టెంబర్ 8--12: ఇంటింటి సర్వే.

సెప్టెంబర్ 21: వర్గాల వారీగా తుది ఓటర్ల జాబితా ప్రచురణ.

41 యూఎల్‌బీల్లో (హైకోర్టు ఆదేశాల తర్వాత డీలిమిటేషన్) ఓటర్ల జాబితాలు ఒక వారంలోగా ప్రచురణకు సిద్ధం.

23 యూఎల్‌బీల్లో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

మొత్తం 123 యూఎల్‌బీల్లో దాదాపు 100 సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి (87 సంస్థల పదవీకాలం మార్చి 2026లో ముగిసింది).

నిబంధనలు

మేయర్/చైర్‌పర్సన్: ప్రత్యక్ష ఎన్నిక. ఐదేళ్ల పదవీకాలం. వార్డు సభ్యుడిగా కూడా పరిగణిస్తారు.

డిప్యూటీ మేయర్/వైస్ చైర్‌పర్సన్ : ఒకరు మాత్రమే (గతంలో ఇద్దరు). పరోక్ష ఎన్నిక.

నామినేషన్ డిపాజిట్: జనరల్ అభ్యర్థులకు రూ. 5,000, ఎస్సీ/ఎస్టీ/బీసీలకు రూ. 2,500.

గరిష్ఠం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.

నోటరైజ్డ్ అఫిడవిట్ (క్రిమినల్ రికార్డు, ఆస్తులు, బాధ్యతలు, విద్యా అర్హతలు) తప్పనిసరి.

ఓటింగ్: బ్యాలెట్ పత్రాల బదులు ఈవీఎంలు. తొలిసారి నోటా అవకాశం.

నోటిఫికేషన్ నుంచి ఖర్చుల ఖాతాల సమర్పణ వరకు పూర్తి ప్రక్రియకు నియమాలు ఖరారు.

## పొగాకు రైతులకు భరోసా

-మొదటిపేజీ తరువాయి

ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల ఊఇ౦ పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా, అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటివరకు నమోదైన సగటు ధర కిలోకు రూ.209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ.248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు. ఇటీవల వేలం కేంద్రాల్లో 'నో--బిడ్' బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11--12 శాతం వరకు 'నో--బిడ్'లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్‌ఫారమ్‌లలో ఇది 1--2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. 'నో--బిడ్'లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్‌లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు. కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు. పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల 'నో--బిడ్'లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్‌ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.----

## ఏపీ పర్యాటకానికి మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

చేయడంతోపాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నారు.

**నాలుగు కొత్త ప్రాజెక్టులివే**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ.101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరుధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.107.94 కోట్లతో 'అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున ఉన్న చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. డిజిటల్ ప్రదర్శనలు, మ్యూజియం, హస్తకళల అనుభవాలు, తదితర సదుపాయాలతో నాగావళి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తారు.

విజయవాడ విమానాశ్రయానికి కిలోమీటర్ దూరంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ.176 కోట్లతో 'గన్నవరం మైస్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసే ఇమ్మర్సివ్ థియేటర్, ప్రసిద్ధ స్వీట్లు, జ్ఞాపికల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.34.29 కోట్లతో ప్రసాద్ పథకం అభివృద్ధి చేయనున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా రాకపోకలు, క్యూల నిర్వహణ, వేచి ఉండే ప్రాంతాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచనున్నారు. టూరిస్ట్ అమెనిటీ సెంటర్, వెయిటింగ్ హాళ్లు, కొత్త అన్నదాన భవనం, వంటశాల, ప్రవేశ ద్వారం, నడక మార్గాలు, ల్యాండ్‌స్కేపింగ్, భక్తుల పార్క్, కూర్చునే ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు.

మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు : స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్టల్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్, సందర్శకులకు సదుపాయాల కల్పన వంటివి వీటిలో ఉన్నాయి.

# వివాహ వేడుకల్లో మండల కన్వీనర్ , జెడ్పిటిసి, మాజీ పిసిబి డైరెక్టర్, ఎంపీపీ

**వేముల కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

వైఎస్ఆర్సిపి నాయకులు జాలపర్తి కుళాయప్ప ఆహ్వానం మేరకు మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి , జెడ్పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి ఆదివారం టిటిడి కళ్యాణ మండపం నందు గుట్టమీద కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఆదివారం టిటిడి కళ్యాణ మండపం వేముల గుట్టమీద జరిగిన వివాహ వేడుక సందర్భంగా కుళాయప్ప కుమా రుడు గంగరాజు, శివపార్వతి దంపతులను కలిసి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి , జెడ్పిటిసి కోకటం వెంకట బయ పురెడ్డి మాట్లాడుతూ నవదంపతులు నిండు నూరేళ్ళు సుఖసం తోషాలతో, అష్టైశ్వ ర్యాలతో జీవించాలని ఆశీర్వదించారు. కొత్త జీవితంలో పరస్పర అవగాహనతో ముందుకు సాగుతూ కుటుం బానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేళ్ల సాంబ శివారెడ్డి , జెడ్పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి, పిసిబి మాజీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, చల్లా వెంకటనారాయణ రాకతో కుళాయప్ప కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. వారికి సాదర స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, కొవ్వూరు గంగాధర, సాకే పెద్ద నాగప్ప, సాకే నాగప్ప, కొవ్వూరు రామాంజనేయులు, వినోద్ కుమార్, నాగరాజు, ప్రతాపు, గంగ ప్రసాద్ సన్నిహితులు పాల్గొని నవదంపతులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.



# గండి క్షేత్రంలో నాల్గవ శ్రావణ శనివారం భక్తుల సందడి

**-7 వేల మందికి అన్నప్రసాదం.. 5,643 మందికి ఉచితంగా ఆయుష్ మందులు**

**-ఒక్కరోజే రూ.26.89 లక్షల ఆదాయం.. వైద్య, రక్తదాన శిబిరాలతో సేవలు**

**గండి సెప్టెంబర్ 6 (కదిలించే వార్త):**

ప్రసిద్ధ గండి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ మాస మహోత్సవాల్లో భాగంగా నాల్గవ శ్రావణ శనివారం భక్తుల సందడి నెలకొంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు, పోలీసులు, వైద్య సిబ్బంది, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఉదయం 4.30 గంటల నుంచే స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. క్యూ లైన్లలో భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నదానం వంటి సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 7 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆయుష్ డైరెక్టర్ రొనంకి గోపాల్‌కృష్ణ ఐఏఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఆయుష్ వైద్య శిబిరంలో 5,643 మంది భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మరో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి భక్తులకు వైద్య సేవలు అందించారు. కడప రిమ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, శ్రీ ఆంజనేయస్వామి సేవా సమితికి చెందిన 15 మంది రక్తదానం చేశారు. నాల్గవ శ్రావణ శనివారం దేవస్థానానికి వివిధ మార్గాల ద్వారా మొత్తం రూ. 26,89,323 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అర్జిత సేవల టికెట్ల ద్వారా రూ. 4,61,228, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 7,58,600, పులిహోర ప్రసాదం ద్వారా రూ. 74,490, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,51,400, తాత్కాలిక హుండీల ద్వారా రూ. 6,15,913 ఆదాయం సమకూరింది. అలాగే తాత్కాలిక షాపుల ద్వారా రూ. 23,000, రంగులరాట్నం ద్వారా రూ. 1,05,000, తలనీలాల ద్వారా రూ. 1,52,760, లడ్డూ కవర్ల ద్వారా రూ. 11,310 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం వివరించింది. శాశ్వత నిత్యాన్నదాన పథకానికి వివిధ దాతల నుంచి రూ. 2,35,622 విరాళాలు అందాయి. నాల్గవ శ్రావణ శనివారం సందర్భంగా కూచిపూడి నృత్యం, కోలాటం, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాబృందాలు ప్రదర్శనలు ఇవ్వడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాత్రి 7.30 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పాపాగ్ని నదీతీరంలో స్వామివారిని వేంచేపుచేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, హనుమత్ షోడశోపచార పూజ, వేద స్వస్తి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐ శంకర్, ఆర్‌కే వ్యాలీ సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు, పాలకమండలి సభ్యులు, శాశ్వత ఉభయదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు



చేపట్టారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, సభ్యులు, సహాయ కమిషనర్--కార్యనిర్వహణాధికారి సి. విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగాయి.

# జనసేన కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా దాసరి రవిశంకర్

**-స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయం**

**వేంపల్లె సెప్టెంబర్ 6 (కదిలించే వార్త):**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసే చర్యల్లో భాగంగా పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీలను నియమించారు. ఇందులో భాగంగా కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా వేంపల్లె పట్టణానికి చెందిన దాసరి రవిశంకర్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. తనకు అప్పగించిన బాధ్యతలపై దాసరి రవిశంకర్ స్పందిస్తూ.. కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహి ళలను సమన్వయం చేయడంతో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలతో క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవడం కమిటీల ప్రధాన బాధ్యతగా ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమర్థవంతంగా సన్నద్ధం చేసి, కూటమి సమన్వయంతో ముందుకు సాగేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కడప పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేందుకు కృషి చేస్తానని రవిశంకర్ తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా



నన్నారు. కాగా, నియమిత సహాయక బృందం సభ్యులకు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు మంగళగిరిలో ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దాసరి రవిశంకర్ తెలిపారు.

# మెగా డీఎస్సీపై కూటమి ప్రభుత్వానికి దమ్ముంటే సమాధానం చెప్పాలి

**-సీబీఐ విచారణకు ఆదేశించాలి..**

**-విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలిలి**

**-వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డిలి**

**పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై అభ్యర్థులు, నిరుద్యోగుల్లో అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జగన్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, డీఎస్సీ నియా మకాల్లో అర్హత లేని అభ్యర్థులకు ఉద్యోగాలు కట్టబెట్టారంటూ ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. "అన్నీ పారదర్శకంగా జరిగాయని ప్రభుత్వం చెబుతుంటే, సీబీఐ వంటి స్వతంత్ర సంస్థతో విచారణ చేయించడానికి ఎందుకు వెనుకాడుతోంది?" అని నిలదీశారు. ఏళ్ల



తరబడి కష్టపడి చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకూడదని అన్నారు. డీఎస్సీ ప్రక్రియపై తలెత్తిన ప్రతి అనుమానాన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. టెట్ అర్హతలు, స్పోర్ట్స్ కోటా, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెరిట్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్ ఆర్డర్ల వరకు ప్రతి దశపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని రామ్ లక్ష్మణ్ రెడ్డి అన్నారు. దరఖాస్తు దశలోనే అర్హత పరిశీలించాల్సిన అభ్యర్థులు తదుపరి దశలను ఎలా దాటారు? సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత కూడా అర్హతపై ప్రశ్నలు ఎలా తలెత్తాయి? నిబంధనలు అందరికీ ఒకే విధంగా అమలయ్యాయా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీపై తమ ప్రభుత్వ అధికారులతోనే విచారణ చేయించడం కంటే స్వతంత్ర సంస్థతో విచారణ జరిపితేనే ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి అవుతాయని ఆయన పేర్కొన్నారు. అందుకే డీఎస్సీ నియామక వ్యవహారాన్ని పూర్తిగా సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. జీవోనిరుద్యోగుల భవిష్యత్తు రాజకీయ ప్రయోగాలకు బలి కావడానికి కాదు. నిజాయితీగా పరీక్షలు రాసిన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారి తరఫున పోరాడుతుంది" అని రామ్ లక్ష్మణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల యువ నాయకులు కంచర్ల ఆదికేశవ రెడ్డి, అరుణ్ రెడ్డి లు తదితరులు పాల్గొన్నారు.

# కోరిన కోరికలు తీర్చే అంకాలమ్మ తల్లికి విశేష పూజలు

**-ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి**

**పులివెందుల అర్బన్ కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి శ్రావణమాసం ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు.దఅనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

**-ఆరుగురి అరెస్ట్.. రూ.22,500 నగదు, కోడి స్వాధీనం**

**వేంపల్లె సెప్టెంబర్ 6 (కదిలించే వార్త):**

టి.వెలమవారిపల్లి గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై సీఐ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు వేంపల్లి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్సై తిరుపాల్ నాయక్ తెలిపారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అరెస్టయిన వారి వద్ద నుంచి రూ. 22,500 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కోడి పందేలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# కమల్ అమృత్ వాణి-250

**వార్త సెప్టెంబర్ 6:**



కృతజ్ఞతా మహద్రత్నం హృదయే యస్య విద్యతే।
అల్పమప్యుపకారం సః స్మరత్యేవ నరోత్తమః॥

తాత్పర్యం. కృతజ్ఞత అనేది మనిషి హృదయంలోని అమూల్యమైన రత్నం. మనకు చిన్న సహాయం చేసిన వారినీ గుర్తుంచుకోవడం మన సంస్కారానికి ప్రతిబింబం. ఎవరైనా మన ప్రయాణంలో తోడుగా నిలిచినప్పుడువారి సహకారాన్ని మరచిపోకూడదు. కృతజ్ఞత మనిషిలో వినయాన్ని, మానవత్వాన్ని పెంచుతుంది. "నాకు అన్నీ నేనే సాధించాను" అనే అహంకారం కంటే "నన్ను ఆదుకున్నవారెందరో ఉన్నారు" అనే భావమే శ్రేష్ఠం.

**-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'**

# సర్వేశ్వర్‌ను పరామర్శించిన వైఎస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

పులివెందుల బలిజ సంఘం నేత సర్వేశ్వర్‌ను మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల సర్వేశ్వర్ కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మనోహర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.?ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హల్ గంగాధర్, బలిజ సంఘం ప్రెసిడెంట్ గూడూరు ప్రసాద్, ఐటిఐ ఆంజనేయులు, మాజీ కో-ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి తదితరులతో పాటు పలువురు బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

**-ఈ నెల 20న రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం**



**వేంపల్లె సెప్టెంబర్ 6(కదిలించే వార్త):**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 20న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం కడప జిల్లా ఆప్ కార్యాలయంలో జిల్లా నాయకత్వం సమావేశమై చర్చించింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశానికి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ కడప జిల్లా కన్వీనర్ సాజిద్ హుసేన్, కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ బిరిలా శ్రీనివాసులు, కో-కన్వీనర్ దాదాపీర్, వేంపల్లి ఆప్ మండల సభ్యులు మహమ్మద్ గౌస్, ఖదీర్, అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి తో వేలూరు భేటీ.



**పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

**-త్వరలో జిల్లా వ్యాప్తంగా సీనియర్ నాయకులతో వేలూరు భేటీ.**

పిసిసి డెలిగేట్ పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జ్ వేలూరు శ్రీనివాసరెడ్డి కమలాపురం నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ ,సీనియర్ నాయకులు పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి తో ఆదివారం భేటీ అయ్యారు ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో ప్రక్షాళన జరగబోతుందని మళ్లీ సీనియర్ నాయకులకు పార్టీలో పూర్వవైభవం రాబోతున్నట్లు చర్చించారు ఈ సందర్భంగా వేలూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలోని అందరూ సీనియర్ నాయకులను కలిసి మళ్లీ కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం వచ్చేలా కృషి చేద్దామని ఆయనతో చర్చించారు. పార్టీకి సీనియర్ నాయకులు దూరంగా ఉండటం వల్ల చాలా నష్టం వాటిల్లుతుందని అందుకోసం జిల్లా వ్యాప్తంగా సీనియర్ నాయకులతో భేటీ అయి తగిన కార్యాచరణ నిర్వహించనున్నట్లు వేలూరు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డితో పేర్కొన్నారు

# అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ





**సింహాద్రిపురం కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

సింహాద్రిపురం మండలం కడపనాగయపల్లెలో ఆదివారం శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి వేద మంత్రలతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థల దాతలు మల్లికార్జునరెడ్డి, పెద్దపుల్లారెడ్డి, నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పెద్దిరెడ్డి రవీంద్రారెడ్డి అర్చకులు ప్రసాదశర్మ తదితరుల ఆధ్వర్యంలో శ్రీ వాణి ట్రస్ట్ నిధులు రూ 30 లక్షలు గ్రామ ప్రజల సహకారంతో నిర్మించనున్న ఆలయానికి సాంప్రదాయ బద్ధంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో నిర్మించబోయే అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్య క్రమం లో టీ టీ డి ఏ ఈ భాస్కర్ రావు, అర్చకులు, స్థల దాతలు, నిర్వాహకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు

## ఆధ్యాత్మిక కేంద్రం నిర్మాణం జరగడం అభినందనీయం

-జయమ్మ కాలనీలో ఘనంగా గణేశ్ దేవాలయం ప్రారంభోత్సవం



పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 6:

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జయమ్మ కాలనీలో వైఎస్ అవినాష్ రెడ్డి సహకారంతో, వైసీపీ నాయకులు మరియు స్థానిక గ్రామస్థుల చొరవతో నిర్మించిన శ్రీ గణేశ్ దేవాలయాన్ని వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారం, నాయకుల సమన్వయంతో ఆధ్యాత్మిక కేంద్రం నిర్మాణం జరగడం అభినందనీయమని అన్నారు. గణేశుడి ఆశీస్సులతో జయమ్మ కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రసూల్, పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, వైసీపీ నాయకులు కోడి రమణ, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మరణంలోనూ మానవత్వం.. రెండు కళ్ల దానం

కదిలించే వార్త ధర్మవరం, సెప్టెంబర్ 6:



ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పీటర్ అలియాస్ రమేష్ 36 అనారోగ్యంతో మృతి చెందారు. ఇందిరమ్మ కాలనీలో షెలూన్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న రమేష్ గత ఐదు నెలలుగా రెండు కిడ్నీలు విఫలమై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆయన ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందినట్లు తెలిపారు. తీవ్ర విషాదంలోనూ కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. రమేష్ రెండు కళ్లను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు భార్య హేమలత, కూతుర్లు షారోన్, సలోమి, కొడుకు జస్వంత్, ముందుకు వచ్చారు. దీంతో ఆయన మరణానంతరం కూడా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలిగింది. రమేష్ మృతితో ఇందిరమ్మ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న కళ్లదాన నిర్ణయాన్ని పలువురు అభినందించారు.

## ఉత్తమ ప్రధానోపాధ్యాయునికి సన్మానం

పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 6:



జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికై, శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ చే సన్మానం అందుకున్న రామకృష్ణయ్య ని స్నేహిత అమృత హస్తం సేవాసమితి వారి స్వగృహం నందు ఘనంగా సన్మానించింది. అధ్యక్షులు రాజు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రామకృష్ణయ్య సేవలు అభినందనీయం, ఆదర్శప్రాయం అన్నారు. పనిచేసిన ప్రతి పాఠశాలను అభివృద్ధికి చిరునామాగా మలచిన ఘనత ఆయనదని కొనియాడారు. అంకాలమ్మ గూడూరు, వేముల, లక్కిరెడ్డిపల్లె, హిమకుంట్ల, పెద్దకుడాల పాఠశాలలను తన అద్భుతమైన నాయకత్వ పటిమతో ఒకవైపు విద్యార్థుల సంఖ్యపరంగా, మరోవైపు విద్యాప్రమాణాలపరంగా, ఇంకోవైపు మౌళిక వసతుల పరంగా ఉన్నత స్థాయికి చేర్చారన్నారు.ఈ కార్యక్రమంలో ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం సభ్యులు గుజ్జుల క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల దరఖాస్తుకు సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు అవకాశం

-ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

సింహాద్రిపురం కదిలించే వార్త సెప్టెంబర్ 6:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ చేపడుతోందని సింహాద్రిపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీనివాసరెడ్డి తెలిపారు.అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.సెప్టెంబర్ 07 నుండి సెప్టెంబర్ 16 వరకు. దరఖాస్తులను మండల పరిధిలోని సంబంధిత గ్రామ / వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వృద్ధాప్య,వితంతు,ఒంటరి మహిళలు,దివ్యాంగులతో పాటు నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అన్ని రకాల పింఛన్ల కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.పింఛన్ దరఖాస్తుదారులు ఆధార్ కార్డు,సంబంధిత ధ్రువీకరణ పత్రాలు (దివ్యాంగ సర్టిఫికెట్ / డెత్ సర్టిఫికెట్ తదితరాలు) జతచేసి సచివాలయంలో నిర్ణీత ఫారమ్‌లో దరఖాస్తు అందజేయాలని ?గడువు ముగిసిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి,అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తారని ఎంపీడీఓ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి త్వరలోనే కొత్త పింఛన్ల మంజూరు, పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు.మండల పరిధిలోని అర్హులైన పేదలు వెంటనే తమ సమీప సచివాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమన్వయకర్తగా చిలకం మధుసూదన్ రెడ్డి

-హిందూపురం, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలు

కదిలించే వార్త ధర్మవరం సెప్టెంబర్ 6:



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డిని హిందూపురం, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గాల స్థానిక సంస్థల ఎన్నికల సమన్వ యకర్తగా పార్టీ నియమించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, సమన్వయం కోసం చిలకం మధుసూదన్ రెడ్డితో పాటు మరో 20 మంది సభ్యులతో కూడిన కోఆర్డినేషన్ టీమ్‌ను పార్టీ ఏర్పాటు చేసింది. ఈ బృందం ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామ స్థాయిలో పార్టీ నాయకులు, కార్య కర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనుంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి బలమైన అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమాచారం సేకరణ, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహాల రూపకల్పన వంటి అంశాలపై ఈ కోఆర్డినేషన్ టీమ్ ప్రత్యేకంగా పనిచేయనుంది. ఆయా ప్రాంతాల్లో పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి కృషి చేయాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం.

## నిరుపేద కుటుంబానికి అండగా అల్ ఇండియా హ్యూమన్ రైట్స్

-నిరుపేద యువతి వివాహానికి సేవా కార్యక్రమం

పులివెందుల రూరల్ కదిలించే వార్త సెప్టెంబర్ 6:

నిరుపేద యువతి వివాహ సందర్భంగా అల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ వరప్రసాద్ , విలేకరి రమేష్ పాల్గొన్నారు. వారు పెళ్లికొడుకు, పెళ్లికూతురు కుటుంబ సభ్యులు, బంధువులు మరియు అతిథులకు స్వయంగా బిర్యానీ వడ్డించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా సమాజ సేవలో భాగంగా నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన అల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ నిర్వాహకులు, సభ్యులను ముఖ్య అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని షేక్ మహబూబ్ పీరా (నేషనల్ డైరెక్టర్ ఒ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్), షేక్ మహమ్మద్ అక్రం హుస్సేన్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ సెల్), షేక్ మాబు సుభాన్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ -- పబ్లిక్ రిలేషన్స్), షేక్ మహమ్మద్ నజీర్ (కడప జిల్లా చైర్మన్ -- హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెల్), షేక్ మహమ్మద్ షకీర్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ -- యాంటీ కరప్షన్ సెల్) ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు షాహుల్, షరీఫ్, సతీష్, వంశీ, రాకేష్, కృతిక్, జ్ఞాని, రక్షిత్, లోకేష్ తదితరులు పాల్గొని సేవలందించారు. భవిష్యత్తులో



కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## గంగమ్మ చింతల దేవస్థానంలో ఘనంగా అభినందన కార్యక్రమం

తొండూరు కదిలించే వార్త సెప్టెంబర్ 6:

పులివెందుల మండల పరిధిలోని గంగమ్మ చింతల దేవస్థానం నందు ఆదివారం ఎం ఇ ఎఫ్ , మరియు ఎం ఆర్ పి ఎస్, నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఈ ఎఫ్, నాయకులు అడవిరాముడు, చిరంజీవి , మహేంద్ర యు సి ఐ ఎల్ లో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి పొందిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జేసీ రామాంజనేయులు రాష్ట్ర Engineers Association -- State టౌన్ ప్లానింగ్ ఎల్ టి పి రాష్ట్ర కార్యదర్శిగా పదోన్నతి పొందిన సందర్భంగా వారికి కూడా అభినందనలు తెలియజేశార



## అధికారుల అశ్రద్ధ... శిథిలావస్థకు బ్రహ్మంగారిమఠం ఇంటర్ భవనం!

బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త సెప్టెంబర్ 6 :

ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి భవనం నిర్మించినా బ్రహ్మంగారిమఠం మండలంలోని హైస్కూల్ ప్లస్ విద్యాలయం విద్యార్థులకు నోచుకోవడం లేదు. నిర్మాణ పనులు పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల భవనం అందుబాటులోకి రాకపోవడంపై ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో 2022లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హైస్కూల్ ప్లస్ తరగతులను ప్రారంభించారన్నారు. మొదటి ఏడాది జడ్పీ పాఠశాలలోనే తరగతులు నిర్వహించి, శాశ్వత భవనం కోసం రూ.1.20 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టారని తెలిపారు.

-శిథిలావస్థకు చేరుతున్న భవనం

భవన నిర్మాణం 80 శాతం పూర్తయినప్పటికీ, మిగిలిన పనులను పూర్తి చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. రెండో ఏడాది నుంచే ఇంటర్మీడియట్ విద్యను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారి, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనం వృథా కావడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు



ప్రశ్నార్థకంగా మారిందని మండిపడ్డారు.

-ఎమ్మెల్యే, అధికారులు చొరవ చూపాలి

రాబోయే విద్యాసంవత్సరం నాటికైనా మైదుకూరు శాసనసభ్యులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి, పెండింగ్ పనులతో పాటు మరమ్మతులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. వెంటనే తరగతులను పునఃప్రారంభించి గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలని కోరారు. సమస్యపై అధికారులు తక్షణమే స్పందించకపోతే విద్యార్థులు, ప్రజలను సమీకరించి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అవసరమైతే




## ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం

-ఎచ్చర్ల శాసన సభ్యులు ఎన్ ఈ ఆర్

కదిలించే వార్త :- రణస్థలం :

ఉపాధ్యాయులు అందించే సేవలు సమాజానికి మార్గదర్శకమని ఎచ్చర్ల శాసన సభ్యులు గౌరవ శ్రీ నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించే భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఉపాధ్యాయు దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారోత్సవం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు . శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి, వారి సేవలను అభినందిస్తూ వారిని సత్కరించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం తో పాటు , వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు,మరియు సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి సద్గుణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనది. ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేయగలడన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన దశాదిశ నిర్దేశిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే గురువుల సేవలు వెలకట్టలేనివన్నారు. గురువు లేని విద్య అసంపూర్ణం అన్న మాటకు నిలువెత్తు నిదర్శనంగా మన ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ప్రయత్నంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పాఠశాల విద్యా శాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి



ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గురువుల సేవలకు శతకోటి వందనాలు తెలిపారు.

## కడప--బెంగళూరు రైల్వే పనులు పునఃప్రారంభించాలి

-ముద్దనూరు--ముదిగుబ్బ మార్గాన్ని మంజూరు చేయాలి

-డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లె సెప్టెంబర్ 6 (కదిలించే వార్త):

రాయలసీమ సమగ్ర అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే అర్ధాంతరంగా నిలిచిపోయిన కడప--రాయచోటి--మదనపల్లి--బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గం పనులను వెంటనే పునఃప్రారంభించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కోరారు. అలాగే ముద్దనూరు--పులివెందుల--ముదిగుబ్బ--పుట్టపర్తి నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌ను మంజూరు చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రెండు రైల్వే మార్గాలు కడప, అన్నమయ్య, చిత్తూరు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.

-255.40 కి.మీ. పొడవుతో కడప--బెంగళూరు లైన్

రాయలసీమ ప్రజల ప్రయోజనాల కోసం 2008--09 రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు యూపీఏ ప్రభుత్వం కడప--రాయచోటి--మదనపల్లి--బెంగళూరు రైల్వే మార్గాన్ని మంజూరు చేసిందని తులసిరెడ్డి తెలిపారు. మొత్తం 255.40 కి.మీ. పొడవైన ఈ మార్గంలో 205 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లో, 50.40 కి.మీ. కర్ణాటకలో ఉంటాయన్నారు. ప్రాజెక్టు వ్యయాన్ని అప్పటి అంచనాల ప్రకారం రూ.3,038 కోట్లుగా నిర్ణయించగా, కేంద్రం, రాష్ట్రం చెరో 50 శాతం నిధులు భరించేలా మంజూరు చేశారని తెలిపారు. 2010



సెప్టెంబర్‌లో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారని, నాలుగు దశల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారని వివరించారు. ఇందులో కడప--పెండ్లిమర్రి మధ్య 21.80 కి.మీ. పనులు పూర్తయ్యాయని, రూ.351 కోట్లు ఖర్చు కాగా రాష్ట్ర వాటాగా రూ.132.39 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడం, భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు నిలిచిపోయాయని తులసిరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పనులు పునఃప్రారంభం కాలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఈ రైల్వే పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

-ముద్దనూరు--ముదిగుబ్బ లైన్‌కు డీపీఆర్

ముద్దనూరు--పులివెందుల--ముదిగుబ్బ--పుట్టపర్తి నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గానికి సంబంధించి 105.31 కి.మీ. పొడవుతో రూ.2,550 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ సమర్పించారని తులసిరెడ్డి తెలిపారు.ఈ మార్గంలో చిన్నదుద్యాల, మల్లేలా, మడూరు, పులివెందుల, అంబకపల్లి, దొరిగల్లు, గునిపల్లి, బుచ్చయ్యగారిపల్లి వద్ద రైల్వే స్టేషన్లు ప్రతిపాదించారని వివరించారు. ఈ మార్గం కడప, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.కేంద్రంతో చర్చించి ముద్దనూరు--ముదిగుబ్బ రైల్వే ప్రాజెక్టుకు త్వరగా మంజూరు తీసుకువచ్చి పనులు ప్రారంభించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డాక్టర్ తులసిరెడ్డి కోరారు.

# కేసీ పాములేటికి ఘన నివాళులు

**-ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్ నాయుడు, తొండం నాటి ప్రశాంత్**

**కడప సెప్టెంబర్ 6 కదిలించే వార్త:**

జమ్మలమడుగు పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కేసీ పాములేటి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఎస్‌యూ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఆర్ఎస్‌యూ కడప జిల్లా కార్యాలయంలో కేసీ పాములేటి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థి ఉద్యమానికి చేసిన సేవలను, విద్యార్థుల సమస్యలపై ఆయన సాగించిన పోరాటాలను నాయకులు స్మరించుకున్నారు. కేసీ పాములేటి అకాల మరణం ఆర్ఎస్‌యూకు, విద్యార్థి ఉద్యమానికి తీరని లోటని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండం నాటి ప్రశాంత్ పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పనిచేసిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి



అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి. రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్ నాయుడు. కడప జిల్లా అధ్యక్షుడు కొండయ్య. కడప జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర. కడప జిల్లా ఉపాధ్యక్షుడు జస్వంత్ కుమార్. తదితరులు పాల్గొన్నారు...

# బీజేపీలో చేరిన ముగ్గురు యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

**కడప, సెప్టెంబర్ 6: కదిలించే వార్త:**

మైదుకూరు పట్టణంలో బీజేపీ ముఖ్య నాయకుల సమక్షంలో ముగ్గురు యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పార్టీలో చేరారు. పార్టీ నాయకుడు రామసుబ్బారెడ్డి అధ్యక్షతన, మండల కమిటీ అధ్యక్షుడు దేవేంద్ర ప్రసాద్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కోండయ్య, రాజేష్, వెంకట శశిధర్ రాజు అనే ముగ్గురు యువ ఇంజనీర్లు సీనియర్ నాయకులు రాజమోహన్ రెడ్డి, రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వారికి స్వాగతం పలికారు. యువత ఆలోచనలు, ఉత్సాహం పార్టీ బలోపేతానికి దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర ప్రసాద్ రెడ్డి, రాజమోహన్ రెడ్డి, రామకృష్ణ, సాయి మదన్, నరేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, కిషోర్ కుమార్, సుబ్బారావు, నరసింహారెడ్డి, రాజేష్, సురేష్, కొండయ్య తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు



# ఫిజికల్ డైరెక్టర్ గా గొడుగుచింత పద్మాకు బెస్ట్ టీచర్ అవార్డు

**తిరుపతి కదిలించే వార్త 6 సెప్టెంబర్ :**

తిరుపతి జిల్లా రేణిగుంట జడ్పీ హైస్కూల్ బాలికల పాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ గొడుగుచింత పద్మ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శనివారం తిరుపతి కచ్చిపి ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డును అందజేశారు. తిరుపతి జిల్లా దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లికి చెందిన గొడుగు చింత ముత్యాలయ్య రోజామ్మ దంపతులకు రెండవ కుమార్తె. విద్యార్థి దశలోనే బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో విశేషంగా రాణిస్తూ రాష్ట్ర,జాతీయ స్థాయిలో అనేక పథకాలను సాధిస్తూనే తిరుపతి శ్రీ పద్మావతి మహిళా కళాశాలలో డిగ్రీ బికామ్ పూర్తి చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం. ఏ తెలుగు ఉన్నత విద్యను అభ్యసించి, ఆపై ప్రొద్దుటూరులో బీపీఈడి విద్యను పూర్తిచేసుకున్న పద్మ 2009లో కుప్పం నియోజకవర్గం టి సదుమూరు జడ్పి హై స్కూల్ లో పిఈటి టీచర్ గా ఉద్యోగంలో చేరారు. అక్కడి నుంచి కొడతనపల్లి, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని నెలవాయి, ప్రస్తుతం రేణిగుంట జడ్పీ హైస్కూల్ నందు ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 17 సంవత్సరాలుగా జిల్లాలోనే వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ క్రీడాభివృద్ధికి విశేషణ కృషి చేశారు. వేలాదిలాదిమంది ప్రతిభ గల విద్యార్థుల క్రీడ ప్రతిభను వెలికితీస్తూ, జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అనేక క్రీడా పోటీలలో పథకాలను సాధించడంలో విశేషంగా కృషి చేశారు. ఈమె జిల్లాలో ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడ విద్యార్థులతో మమేకమవుతున్నారు. ముఖ్యంగా బాలికలలో ఆత్మస్థైర్యం పెంచేలా సెల్ఫ్ డిఫెన్స్ గేమ్స్ జూడో కుస్తీ వంటి గేమ్స్ నేర్పిస్తూ వారిలోని క్రీడా ప్రతిభను వెలికి తీస్తున్నారు. ఏడాదికి వివిధ పోటీలలో సరాసరి 50 బంగారపుతకాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. గత



నెలలో నిర్వహించిన గ్రాబ్లింగ్ . ఇదే స్ఫూర్తితో మరింత మంది క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా తీర్చి దిద్దుతామని ఆమె తెలిపారు. ఇప్పటికే రేణిగుంట జడ్పీ హైస్కూల్ చెందిన ఓ విద్యార్థిని అంతర్జాతీయ స్థాయికి మరో కొంతమంది జాతి స్థాయిలో

# బాలికలు, మహిళల భద్రతపై శక్తి టీమ్ అవగాహన

**-శక్తి యాప్ వినియోగం, మహిళలు..బాలికల భద్రతపై అవగాహన.**

**-సైబర్ మోసాలు, తెలియని లింకులు, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తత.**

**-క్రమశిక్షణ, మంచి స్నేహం, నైతిక విలువలు, చదువు ప్రాధాన్యతపై సూచనలు.**

**తిరుపతి క్రైమ్ కదిలించే వార్త 6 సెప్టెంబర్:**

తిరుపతి తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శక్తి పోలీస్ టీమ్ సిబ్బంది బిరవపట్టడ ఆర్చ్ సమీపంలోని ాా. ఎ.ఔ.=. బాలికల పాఠశాల మరియు హాస్టల్ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, ఈవ్‌టీజింగ్, మహిళలు మరియు బాలికల భద్రత, సెల్‌ఫోన్లు మరియు సోషల్ మీడియా దుష్ప్రభావాలు, తెలియని లింకులు, అనుమానాస్పద వీడియో కాల్స్, సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేయడం వల్ల కలిగే సమస్యలు, టీనేజ్ ఆకర్షణలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే చైల్డ్ అబ్యూస్, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, చైల్డ్ పోర్నోగ్రఫీ, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత, మొబైల్ గేమ్స్ దుష్ప్రభావాలు, మంచి స్నేహం, మంచి ప్రవర్తన, మంచి అలవాట్లు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, చదువు ప్రాధాన్యత, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను గౌరవించడం వంటి అంశాలపై విద్యార్థినులకు సూచనలు అందించారు. సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి

**-కమిషనర్ జయకృష్ణ**

**తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 6 సెప్టెంబర్:**

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ 7వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.



# శాసనాల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ చరిత్ర

**తిరుపతి కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

శాసనాల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ చరిత్ర వెయ్యేళ్లకు పైగా కొనసాగుతున్న ఉత్సవ వైభవం... రాజులకాలం నుండి టీటీడీ నిర్వహణ వరకు సాగిన అపూర్వ పరిణామం







# ఆర్యవైశ్య పాత్రికేయులకు సన్మానం



**పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 6:**

కల్వకుంట్ల చంద్ర సేన గుప్త జయంతి మహోత్సవాలు పురస్కరించుకొని వరల్డ్ జర్నలిస్ట్ డే సందర్భంగా వాసవి క్లబ్ మరియు ఆర్యవైశ్య సంఘంఆధ్వర్యంలో ఆర్యవైశ్య పాత్రికేయులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా పాత్రికేయులు దుద్దేళ్లయ్య( కదిలించే వార్త) మిట్ట మహేష్ (సీమ వార్త) వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మాలేపాటిహరి ఆర్య సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు వాసవి క్లబ్ నాయకులు రాజుల సుబ్రహ్మణ్యం మేడం దినేష్ గుప్తా దిండుకుర్తి నాగభూషణం వినోద్ కుమార్ మహేష్ వాసవివనిత క్లబ్ మేడా సుబ్బరత్నమ్మ తల్లం స్వర్ణలత సుంకు సువర్ణ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగులకు వరాలు ప్రకటించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు



**కడప, సెప్టెంబర్ 6: కదిలించే వార్త:**

ఉద్యోగులకు పలు ప్రయోజనాలు కల్పించే నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లైస్ స్టేట్ డైరెక్టర్ చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేయడం, సరెండర్ లీవులకు నగదు చెల్లింపులకు అంగీకరించడం, పెన్షనర్ల అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకోవడం, 12వ పీఆర్సీ కమిషనర్ నియామకానికి సమ్మతించడం, ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌కు సంబంధించిన బకాయిల చెల్లింపులకు అంగీకరించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని సుబ్బరాయుడు యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవాని, తేజ, రిటైర్డ్ ఉద్యోగి సుబ్బరాయుడు, నాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.కావాలంటే దీనిని ఇంకా చిన్నగా 8--10 లైన్ల జిల్లా పేజీ వార్తగా కూడా తయారు చేయగలను.

# వినాయక నిమజ్జనానికి నీళ్లు ఇవ్వలేమనడం సరికాదు.

**-ప్రజల మనోభావాలను గౌరవించాలి.**

**- కడప నగరానికి నీటి సరఫరా పై ముందస్తు ప్రణాళిక ఏది?**

**- మాజీ మేయర్ పాక సురేష్**

**కడప సెప్టెంబర్ 6 కదిలించే వార్త :**



వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఇవ్వలేం అనడం సరికాదు, ప్రజల మనోభావాలను గౌరవించాలి, కడప నగరానికి నీటి సరఫరా పై ముందస్తు ప్రణాళిక ఏదని కడప మాజీ మేయర్ పాక సురేష్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ అని, నిమజ్జనానికి నీటి సౌకర్యం కల్పించలేమని చెప్పడం సరికాదన్నారు. నగరంలో నీటి సమస్య ఉంటే ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి ముందస్తు ప్రణాళికతో నిమజ్జనానికి అవసరమైన నీటిని సమకూర్చాలని కోరారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ పండుగలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో నీటి సౌకర్యంతో పాటు పారిశుధ్యం, లైటింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి, నగర జనరల్ సెక్రటరీ రెడ్డివర కుమార్ పాల్గొన్నారు.కావాలంటే దీనికి మరింత పదునైన రాజకీయ హెడ్‌లైన్‌తో చిన్న వార్తగా కూడా మార్చవచ్చు.

# దంత సమస్యలకు ఆధునిక వైద్యం

**-ఐవీఓఆర్‌వై డెంటల్ హాస్పిటల్‌లో సమగ్ర దంత సేవలు**

**కడప, సెప్టెంబర్: కదిలించే వార్త:**



మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయసు నుంచే దంత సమస్యలు ఎదురవుతున్నాయని డాక్టర్ సాయి తేజ తెలిపారు. పంటి నొప్పి, చిగుళ్ల సమస్యలు, పళ్లపై గార, పళ్ల అమరిక లోపాలు, దంతాలు కోల్పోవడం వంటి సమస్యలకు సకాలంలో వైద్యం అవసరమన్నారు. ఆదివారం రాజీవ్ పార్కు సమీపంలో సోనోవిజన్ ఎదురుగా ఐవీఓఆర్‌వై డెంటల్ హాస్పిటల్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి తేజ మాట్లాడుతూ రోగుల సమస్యలను గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఆధునిక పద్ధతుల్లో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. క్రౌన్స్, బ్రిడ్జెస్, డెంటర్స్, డెంటల్ ఇంప్లాంట్స్, వెనియర్స్, స్మైల్ డిజైనింగ్ తదితర దంత చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పంటి నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కడప జిల్లా ప్రజలు ఆధునిక దంత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, డాక్టర్ ఆకాష్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రవి, చింతలపల్లి మధు, వైద్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ వీఎల్ఓ లక్ష్మీనరసింహులుకు ఘన సన్మానం

**-టిడిపి కోశాధికారి మల్రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విమ్స్ డెవలప్మెంట్ నెంబర్ వేముల అనోష్**

**కడప సెప్టెంబర్. 6 కదిలించే వార్త:**



కడప వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ (వీఎల్ఓ)గా విధులు నిర్వహించి ఆగస్టు 31, 2026న పదవీ విరమణ పొందిన ఎస్. లక్ష్మీనర సింహులు (ఆకుల వీధి లచ్చుల్)ను ఘనంగా సన్మానించారు. ఆదివారం కడపలోని నూర్‌జహాన్ కళ్యాణ మండపంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కోశాధికారి మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కడప రిమ్స్ డెవలప్‌మెంట్ సభ్యుడు, 25వ డివిజన్ యూనిటీ ఇన్‌చార్జి వేముల అనోష్ పాల్గొని లక్ష్మీనరసింహులను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వేముల అనోష్ మాట్లాడుతూ.. వృత్తి ధర్మంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ నిబద్ధతతో వ్యవహరిస్తూ, మంచితనం, సేవాభావంతో అవసరమైన వారికి అండగా నిలిచే వ్యక్తిగా లక్ష్మీనరసింహులు మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగే మనస్తత్వం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని వారు ఆకాంక్షించారు.కావాలంటే ఇదే వార్తను మరింత ఆకర్షణీయమైన హెడ్‌లైన్, సబ్‌హెడ్‌తో పత్రికలో ప్రచురించే విధంగా కూడా తయారు చేయగలను.

# చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు ఎమ్మెల్యే



**చిత్తూరు జిల్లా కదిలించే వార్త సెప్టెంబర్ 6 :**

విఎం థామస్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కలిసి మా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని అడిగారు మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు మీ నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు ఎమ్మెల్యే ఎమ్మెల్యే థామస్ తో మాట్లాడుతూ నియోజవర్గ నాయకులు పెనుమూరు మండలం అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని



**కుందుర్పి మండలం, కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం కరిగానిపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబెద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు.. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆహ్వానం మేరకు ఆయన కుమార్తె శ్రావణి వెడ్స్ అభిత్ కుమార్ ల వివాహ వేడుకకు హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, టీడీపీ నాయకులు..

## ఆర్డీఓ ఉత్తర్వులను దిక్కరించి భూమిలోకి వెళ్లేందుకు కబ్జాదారుడి యత్నం.!

**-జేసీబీలతో కబ్జాదారిడి వీరంగం..రెవెన్యూ సిబ్బంది పై దూర్భాషలు.**





**-నకిలి పత్రాలు, ప్రత్యర్థి వారి వంశవృక్షాల తయారీకి పాల్పడ్డ గాండ్ల చంద్రశేఖర్.**

**అనంతపురం, కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

స్థానిక రూరల్ మండల పరిధిలోని భూ హక్కుదారులను తేల్చి ఇచ్చిన ఆర్డీవో ఆర్డర్ ను ధిక్కరించిన గాండ్ల చంద్రశేఖర్, అధికారుల ఆదేశాలతో అడ్డుకోవడానికి ప్రయత్నించిన స్థానిక రెవెన్యూ సిబ్బంది పై నానా దుర్భాషలు. కక్కలపల్లి రూరల్ పంచాయతీకి చెందిన భూమి విషయంలో వివాదం ముదురుతోంది. అదే గ్రామ పొలం సర్వే నంబర్ 252-3 లో 6.64 ఎకరాల విస్తీర్ణంలో 4.89 ఎకరాల భూమి పై కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు భూ హక్కుదారులు తెలిపారు. ఈ కబ్జాకు తెరవలేపేందుకు ఓ ప్రధాన ఆధారంను నకిలీ రైతు వారి పట్టాను అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు తయారు చేసి వాటిని అడ్డుపెట్టుకొని, తమకు ఎలాంటి హక్కు లేకపోయినా గాండ్ల చంద్రశేఖర్, కోనప్ప, వెంకటనారాయణ, ఆదిరెడ్డి, కకలపల్లి మాజీ సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, దామోదర, గోపాల్, గూడూరు మల్లికార్జున అను వారందరూ వైసీపీ పార్టీకి చెందినవారు ఈ వివాదం కూడా గత ప్రభుత్వం నుండే సాగుతోంది. సదరు భూమి పై హక్కు ఉన్నట్లుగా వ్యవహరిస్తూ, గతంలో నుంచే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని భూహక్కుదారులు పేర్కొన్నారు. అంతేకాకుండా, భూమిని ఆక్రమించుకునే ఉద్దేశంతో తమ వంశవృక్షాన్ని సైతం తానే తయారు చేసి, రెవెన్యూ అధికారుల వద్ద దానిపై సంతకాలు చేయించేందుకు పైరవీలు, ఒత్తిళు చేశారని వారు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో విసిగిపోయిన భూబాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో పాటు ఆర్డీఓ కోర్టులో అప్పీల్ దాఖలు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం ఆర్డీఓ కోర్టు భూహక్కుదారులకే సక్రమమైన హక్కు ఉందని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బాధితులు ఆధారాలు చూపారు. అయితే ఆ ఉత్తర్వులు వెలువడినప్పటికీ సదరు భూమిలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని భూహక్కుదారులు ఆశ్రయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అధికారులు అందుబాటులో లేని సమయాల్లో, సెలవు రోజులు, రాత్రి వేళల్లో జేసీబీలతో భూమిలోకి ప్రవేశించి సాగులోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వారు చెప్పారు. తాజాగా ఆదివారం కూడా జేసీబీతో సదరు భూమిలోకి వెళ్లేందుకు ప్రయత్నం జరిగింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని భూమిలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నట్లు బాధితులు తెలిపారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బందిని సదరు వ్యక్తి నానా దుర్భాషలాడాడు. ఆర్డీఓ ఉత్తర్వుల పూర్తి వివరాలు, రెవెన్యూ రికార్డులు, పట్టా పత్రాలు, వంశవృక్షం తదితర అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని భూహక్కుదారులు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ రికార్డుల్లో తప్పుడు సమాచారం సమర్పించడం, ఇతరుల భూమిపై హక్కు ఉన్నట్లు చూపించే ప్రయత్నాలు జరిగి ఉంటే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బందిని విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం లేదా దుర్భాషలాడిన ఘటనపై కూడా విచారణ జరిపి క్రిమినల్, చీటింగ్ కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

కమనీయం శ్రీ వెంకటేశ్వర కళ్యాణం

## సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సప్త శనివారల వ్రతం దిగ్విజయంగా ముగిసినది





**అనంతపురం, కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

ఎనిమిదో వారం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని తపోవనం లోని చిన్మయ జగదీశ్వరాలయంలో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ త్రిదండి చిన్న రామానుజ జీయర్ స్వామి శిష్య బృందం శ్రీ చింతల రాయల్ ఆధ్వర్యంలో వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి సంప్రదాయపద్ధంగా కళ్యాణాన్ని నిర్వహించారు. ఈరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైభవంగా శ్రీనివాస కళ్యాణం జరిగినది అనంతరం నారాయణ సేవ జరిగినది. ఈ కార్యక్రమం సేవాకర్తలు శ్రీమతి వై రుక్మిణి, శ్రీమతి అనురాధ దంపతులు, శ్రీమతి అరుణ దంపతులు ఆర్థిక సాయం అందించారు ఈ కార్యక్రమంలో చిన్మయ జగదీశ్వర్ ఆలయం ఇన్చార్జ్ స్వామి ఆత్మ విధానంద నాగరాజు దంపతులు కే వి ఎస్ ప్రకాష్ సాయి ట్రస్ట్ బృందం రాఘవేంద్ర నరేష్ తదితరులు పాల్గొన్నారని అని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ విజయ సాయికుమార్ తెలిపారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు

# అక్షర శిల్పులకు నీరాజనం: ఉత్తమ ఉపాధ్యాయురాళ్లు విజిత, కేశవ లక్ష్మీదేవిలకు ఘన సన్మానం



**-గౌతమ్ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ**

**కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

విద్య అంటే కేవలం పుస్తకాల్లోని అక్షరాలు దిద్దించడం కాదు... అజ్ఞానపు చీకట్లను పారద్రోలి, ఒక తరాన్ని సుజ్ఞాన కాంతుల వైపు నడిపించే పవిత్ర యజ్ఞం. ఆ యజ్ఞంలో తమ జీవితాలనే సమిధలుగా మార్చి, విద్యాబోధనను వృత్తిగా కాకుండా దైవకార్యంగా భావించే అక్షర మూర్తులు ఉపాధ్యాయులు. కన్నతల్లి శరీరాన్ని ఇస్తే, అక్షరాల అమ్మగా నిలిచి పిల్లల భవిష్యత్తుకు ప్రాణం పోస్తూ విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందిస్తున్న ఇద్దరు మహోన్నత ఉపాధ్యాయురాళ్లు శ్రీమతి గుడిపాటి విజిత, శ్రీమతి గుండ్రెడ్డి కేశవ లక్ష్మీదేవిలను గౌతమ్ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ శనివారం ఘనంగా సత్కరించింది. అసోసియేషన్ వ్యవస్థాపకులు శ్రీ అరవ అయ్యప్ప గారి నేతృత్వంలో నిర్వహించిన ఈ అభినందన సభలో అరవ రాయప్ప ముఖ్య అతిథిగా హాజరై, ఉపాధ్యాయురాళ్లను శాలువా, పూలమాలలు, బుద్ధ విగ్రహంతో అత్యంత వైభవంగా సన్మానించారు.

**-అక్షర తపస్విని... మాతృమూర్తి శ్రీమతి విజిత:**

కలువాయి మండలం చవటపల్లి ఎస్జీటీ ఉపాధ్యాయురాలైన గుడిపాటి విజిత స్వగ్రామం నెల్లూరు రూరల్ సౌత్ మోపూరు. గుడిపాటి సుబ్బరాయుడు, రమణమ్మల ముద్దుల కుమార్తె అయిన విజిత, చిన్నతనం నుంచే చదువుపై అమితమైన శ్రద్ధ కనబరిచారు. గ్రామంలోని వాణిశ్రీ హైస్కూల్లో పాఠశాల విద్యను, నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. భర్త ఏ.వి. సుబ్రహ్మణ్యం అందించిన అపూర్వ సహకారం, తోడ్పాటుతో బీఈడీ పూర్తి చేసి, 1998లో ఉపాధ్యాయురాలిగా అక్షర ప్రయాణం ప్రారంభించారు. పాఠశాల పరిసరాలను దేవాల యంగా, పసి పిల్లలను తన సొంత బిడ్డలుగా భావించే విజిత, నిరంతరం చిరునవ్వుతో, ప్రేమాభిమానాలతో పాఠాలు బోధిస్తారు. ఏ రోజూ కేవలం వేతనం కోసం పనిచేయక, క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుత విద్యను అందిస్తూ ఆ గ్రామంలోని విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. "తెలంగాణ గవర్నర్ అవార్డు కంటే నా చిన్నారుల చిట్టి చేతులు ఆప్యాయంగా అందించే పండ్లు, తాంబూలమే నాకు మిన్న" అని చెప్పే ఆమె మాతృ హృదయం ఎందరికో ఆదర్శం. అంతేకాక, తెలుగు భాషపై ఉన్న మమకారంతో మధురమైన కవితలు రాస్తూ, పిల్లలకు ఒత్తిడి లేని ఆనందకర వాతావరణంలో చదువు నేర్పిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

**-శ్రీమతి విజిత గారి పురస్కారాల వైభవం:**

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తిరుపతి పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ (2023) ఆధ్వర్యంలో, తెలంగాణ మాజీ గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డు" అందుకున్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు పొందారు. నెల్లూరు విశ్వబ్రహ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్మకూర్ రాఘవచారి, ప్రధాన కార్యదర్శి పోకూరు శ్రీనివాస్ ఆచారి, జిల్లా కన్వీనర్ తిరువల్లూరు రమేష్ ఆచారి, ఉపాధ్యక్షులు మహిమలూరు రమణయ్య ఆచారి, రాష్ట్ర కార్యదర్శి కావులూరు కృష్ణ ఆచారి, పట్నం మల్లికార్జున ఆచారి, ఎన్నూర్ రమణయ్య ఆచారి, ఆచారం వెంకట సుబ్రహ్మణ్యం ఆచారి, కోశాధికారి సుధాకర్ ఆచారీల చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

**-అంకితభావానికి నిదర్శనం -- శ్రీమతి కేశవ లక్ష్మీదేవి:**

సైదాపురం మండలం మర్లపూడి పాఠశాలలో ఎస్జీటీ (ఫిజిక్స్) ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న శ్రీమతి గుండ్రెడ్డి కేశవ లక్ష్మీదేవి (భర్త వెంకట వరప్రసాద్) కూడా తమ వృత్తిధర్మంతో అంకితభావాన్ని చాటుకుని, విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతూ ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ద్వారా ఘన సన్మానం పొందారు.

**-అమ్మల ఆశయ సాధకులుగా పిల్లలు:**

విద్య విశిష్టతను సమాజానికి చాటిన ఈ ఇద్దరు ఉపాధ్యాయురాళ్ల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి సమాజానికి సేవలు అందిస్తుండటం విశేషం. విజిత, కుమారుడు ఏ. నాగా పరబ్రహ్మ (వీడీదీూ), కోడలు ప్రవళిక (MHMS, MD) హైదరాబాదులో వైద్యులుగా సేవలందిస్తుండగా... కేశవ లక్ష్మీదేవి, కుమార్తెలు టి. భావన వెంకట్ ఇంజనీర్గా, టి. సాయి దీక్షిత హైదరాబాదులో హోమియో వైద్యురాలిగా రాణిస్తున్నారు. ఎన్నో వృత్తిపరమైన బాధ్యతలు ఉన్నప్పటికీ, తమ తల్లులు పొందుతున్న ఈ పురస్కార వేడుకను కళ్లారా చూసి ఆనందించడానికి వీరంతా తరలిరావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

# సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

**-మెగా జాబ్ మేళా, యోగా సెంటర్ ప్రారంభం, ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొననున్న మంత్రి**

**ధర్మవరం, కదిలించే వార్త, సెప్టెంబర్ 06:**

సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పలు ముఖ్యమైన కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొననున్నారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

**-సెప్టెంబర్ 8న మెగా జాబ్ మేళా....**

సంస్కృతి సేవా సమితి సహకారంతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీ మంగళవారం ఉదయం 10:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని జచీదీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో మాజీ డీఆర్డీఓ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి. సతీష్ రెడ్డితో కలిసి మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం, వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగ అవకాశాలను పొందేలా ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొంది.



-సెప్టెంబర్ 9న యోగా సెంటర్ ప్రారంభం....

సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం ఉదయం 9:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్పై నూతనంగా ఏర్పాటు చేసిన యోగా సెంటర్ను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ యోగా సెంటర్ను ఏర్పాటు చేసినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ప్రస్తుత జీవనశైలిలో యోగా, వ్యాయామం, ఆరోగ్యకరమైన అలవాట్లకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా యోగా కేంద్రాలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చని పేర్కొంది.

**-ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మంత్రి....**

అదే రోజు ఉదయం 10:00 గంటలకు ధర్మవరం రూరల్ మండలంలోని గొట్లూరు గ్రామంలో నిర్వహించనున్న ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఓబీసీ వర్గాల సంక్షేమం, వారికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నారు. రెండు రోజుల ధర్మవరం పర్యటనలో భాగంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఈరన్న స్వామి ఆలయ నిర్మాణానికి 4,00,000 రూపాయలు ఎమ్మెల్యే అమిలినేని, 2,00,000 రూపాయలు పార విశ్వనాథ్ అందజేత







**- టీటీడీ నుంచి కూడా నిధులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటా..ఎమ్మెల్యే అమిలినేని**

**కళ్యాణదుర్గం నియోజకవర్గం, కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం కరిగానిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఈరన్న స్వామి ఆలయ నిర్మాణం కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు తన వంతుగా స్వంత నిధులు 4,00,000 రూపాయలను, పెరవలి పార విశ్వనాథ్ 2ఖ,00,000 రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు..అంతే కాకుండా ఆలయం పూర్తి అవడం కోసం టీటీడీ నుంచి కూడా నిధులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలియజేశారు..అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ని, పార విశ్వనాథ్ ని ఘనంగా సన్మానించారు..

# శివ ధ్యాన మందిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అమిలినేని, నటుడు శ్రీకాంత్

**- 25వ రజతోత్సవం సందర్బంగా ధ్యానమందిరం ప్రారంభం**

**కళ్యాణదుర్గం, కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో ఉన్న ఈశ్వరీయ ప్రజాపిత బ్రాహ్మకుమారీస్ విశ్వావిద్యాలయం ఆధ్వర్యంలో నేడు 25వ రజతోత్సవం పురష్కరించుకుని శివ ధ్యానందిరాన్ని కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు, ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు..అనంతరం ధ్యానమందిరంలో 25వ రజతోత్సవం సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది.సినీ నటుడు శ్రీకాంత్ ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శాలువతో సన్మానించారు...





# జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు.





**అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, సెప్టెంబర్ 06 :**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్, ఘా ఆదేశాల మేరకు ఈరోజు సాయంత్రం జిల్లాలోని అన్ని ోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అధికారులు అవగాహన కల్పించారు. పోలీసు అధికారుల సూచనలు : హెల్మెట్/సీట్ బెల్టు తప్పనిసరి : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలి. ర్యాష్ డ్రైవింగ్పై హెచ్చరిక : మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటివి ప్రాణాంతకమని స్పష్టం చేశారు. చట్టపరమైన చర్యలు : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలను స్వచ్ఛందంగా పాటించడం ద్వారా తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని పోలీసులు తెలిపారు.

# బిజినెస్

## భారీగా బ్యాంకు ఉద్యోగాలు..




దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగార్థులకు తీపి కబురు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026--27లో సుమారు 11,000 నుంచి 12,000 మంది ఉద్యోగులను నియమించుకోవాలని బ్యాంకు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. క్లరికల్, ఆఫీసర్ కేడర్లలోనే ప్రధానంగా నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నియామకాల సంఖ్యలో కొంత మార్పు ఉండొచ్చని శెట్టి పేర్కొన్నారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు అవసరాలను బట్టి తుది సంఖ్య నిర్ణయిస్తామని, అయితే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దాదాపు 12 వేల నియామకాలు ఉండొచ్చని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి నియామకాలు తగ్గడానికి ప్రధాన కారణం ఐటీ విభాగంలో గతేడాది మాదిరిగా పెద్ద సంఖ్యలో నిపుణులు అవసరం లేకపోవడమేనని ఆయన తెలిపారు.

**గతేడాది 25,633 మందికి ఉద్యోగాలు**

2025--26 ఆర్థిక సంవత్సరంలో ఎస్బీఐ మొత్తం 25,633 మందిని నియమించుకుంది. ఇందులో 4,640 మంది అధికారులు, 19,340 మంది అసోసియేట్లు, 1,653 మంది కాంట్రాక్ట్ సిబ్బంది ఉన్నారు. ముఖ్యంగా సుమారు 1,500 మంది స్పెషలిస్ట్ ఐటీ అధికారులను గతేడాది నియమించినట్లు శెట్టి చెప్పారు. మార్చి 2026 నాటికి ఎస్బీఐ మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది.

**మరో 250 శాఖలు రావొచ్చు**

ఉద్యోగ నియామకాలతో పాటు బ్యాంకు శాఖల నెట్‌వర్క్‌ను కూడా విస్తరించేందుకు ఎస్బీఐ సిద్ధమవుతోంది. కొత్త కాలనీలు ఏర్పడుతున్న ప్రాంతాలు, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఇంకా బ్యాంకింగ్ సేవలకు అవకాశం ఉందని శెట్టి తెలిపారు. కొన్ని శాఖలను హేతుబద్ధీకరించినప్పటికీ, నెట్‌గా ఏటా 200 నుంచి 250 శాఖలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

# 11 కంపెనీలు.. 7,055 కోట్లు..

## ఈ వారం ఐపీఓలు ఇవే

ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించనున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్‌లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్‌తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే..




**ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!**

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది.

కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632.

ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు.

గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది.

రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి.

కరమ్‌తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది.

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది.

స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి ఇంకా వెల్లడించలేదు.

వీగాలాండ్ డెవలపర్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబర్ 10న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 15న సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. రూ.210 కోట్ల నిధులను ఐపీఓ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణి వెల్లడించాల్సి ఉంది.

# బ్యాంక్ అకౌంట్ లేకున్నా క్రెడిట్ కార్డు తీసుకోవచ్చా ? ఎవరికి జారీ చేస్తారు?

సార్/ మేడం మేం పలానా బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం. మీకు క్రెడిట్ కార్డ్ ఏమైనా కావాలా అని వారి రిప్రజెంటెటివ్స్ అడుగుతుంటారు. అయితే క్రెడిట్ కార్డు తీసుకోవడానికి బ్యాంకులో అకౌంట్ ఉండటం అవసరమా? అంటే తప్పనిసరిగా అదే బ్యాంకులో అకౌంట్ ఉన్న వ్యక్తికే క్రెడిట్ కార్డు ఇవ్వాలనే రూల్ ఉండదు. పలు బ్యాంకులు తమ వద్ద బ్యాంక్ అకౌంట్ లేని వారికి కూడా క్రెడిట్ కార్డులు జారీ చేస్తుంటాయి. నిపుణుల ప్రకారం, బ్యాంకులు ముందుగా దరఖాస్తుదారుడి ఆదాయం ఎంత, వారు ఏ పని చేస్తారు, క్రెడిట్ స్కోర్ ఎలా ఉంది. సమయానికి బిల్ పేమెంట్ చేయగలరా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. ఈ విషయాల్లో క్లారిటీ వస్తే చాలు బ్యాంక్ అకౌంట్ లేకుండానే కూడా ఆ వ్యక్తికి క్రెడిట్ కార్డు జారీ చేస్తారు.

**ఎఫ్‌డీని చూసి క్రెడిట్ కార్డు జారీ**

కొన్నిసార్లు ఒక వ్యక్తికి బ్యాంక్ అకౌంట్ కూడా ఉండదు. దాంతో వారికి క్రెడిట్ హిస్టరీ కూడా ఉండదు. అలాంటి సందర్భాల్లో కొన్ని బ్యాంకులు ఎఫ్‌డీ(ఖీణ)కి బదులుగా కూడా క్రెడిట్ కార్డు జారీ చేస్తాయి. దీని ద్వారా ప్రజలకు మంచి క్రెడిట్ హిస్టరీ క్రియేట్ చేసుకునే అవకాశం లభిస్తుంది. అంటే వ్యక్తికి క్రెడిట్ కార్డు వస్తుంది. అక్కడి నుంచి ఆ వ్యక్తికి క్రెడిట్ హిస్టరీ ప్రారంభమవుతుంది.

**క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు ప్రక్రియ**

క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆధార్ కార్డు, పాన్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, మీ ఆదాయానికి సంబంధించిన కొన్ని అవసరమైన డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయాలి. అయితే ప్రతి బ్యాంక్‌కు వారికంటూ వేర్వేరు రూల్స్, కండీషన్స్ ఉంటాయని గుర్తుంచుకోండి. చాలాసార్లు ప్రీపెయిడ్ కార్డు, క్రెడిట్ కార్డుకు ప్రత్యామ్నాయం అని ప్రజల్లో అపోహ ఉంటుంది. కానీ అందులో నిజం కాదు. ప్రీపెయిడ్ కార్డులో మీరు మీ డబ్బును ముందుగానే లోడ్ చేసి ఖర్చు చేస్తారు.

**క్రెడిట్ కార్డు, ప్రీపెయిడ్ కార్డుకు మధ్య వ్యత్యాసం ఏమిటి?**

క్రెడిట్ కార్డు, ప్రీపెయిడ్ కార్డు 2 వేర్వేరు రకాల కార్డులు అని గ్రహించాలి. బిల్లులు సకాలంలో చెల్లిస్తూ క్రెడిట్ కార్డును సరిగ్గా ఉపయోగిస్తే మీ క్రెడిట్ స్కోర్ మెరుగుపడవచ్చు.




అయితే ప్రీపెయిడ్ కార్డు వినియోగం క్రెడిట్ స్కోర్‌పై ఎలాంటి ప్రభావం చూపదు. ప్రీపెయిడ్ కార్డు అంటే ముందుగానే మనీ జమ చేసే కార్డు. వినియోగదారు కార్డులో ఉన్న మొత్తాన్ని తమ అవసరాలకు తగ్గట్లుగా ఖర్చు చేయవచ్చు. క్రెడిట్ కార్డును మీ వద్ద నగదు లేకపోయినా అందులో ఉన్న లిమిట్ వరకు షాపింగ్ చేయవచ్చు. బిల్లులు పే చేసే వీలుంటుంది. అందువల్ల ప్రీపెయిడ్ కార్డును క్రెడిట్ కార్డుగా భావించవద్దు.

**క్రెడిట్ కార్డుతో జాగ్రత్త**

క్రెడిట్ కార్డును బాగా ఆలోచించి, జాగ్రత్తగా అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగించాలి. ఎంత ఖర్చు చేస్తారో, దాని బిల్ సైకిల్ సమయానికి తిరిగి చెల్లించాలి. సరిగ్గా ఉపయోగిస్తే క్రెడిట్ కార్డు అవసరమైన సమయంలో మిమ్మల్ని ఆదుకుంటుంది. క్రెడిట్ కార్డు తీసుకునే ముందు దాని వడ్డీ రేటు, వార్షిక ఫీజు, లేట్ ఫీజుతో పాటు ఇతర అన్ని ఛార్జీల గురించి పూర్తిగా తెలుసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# ఆ ఒక్క విజయం.. పాక్ క్రికెట్ పతనం ప్రారంభం!

పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్‌లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ (ు20 ఔజ 2021)లో భారత్‌పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు.




"2021లో భారత్‌పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్‌లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్‌కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్‌పై విజయం తర్వాత వన్డే, టీ20 ప్రపంచ కప్‌లు, ఆసియా కప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు" అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు.

2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ అజామ్ (68లి), మహ్మద్ రిజ్వాన్ (79లి) నాటౌట్‌గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్-ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

## మా అక్కలు ప్లాన్ చేస్తే మేము ఆచరిస్తాం'

మహిళల ఆసియా కప్ 2026లో భారత మహిళా క్రికెటర్ శ్రీ చరణి తన ప్రదర్శనతో అదరగొడుతుంది. శనివారం పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసిన శ్రీ చరణి కేవలం ఏడు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు కీలక వికెట్లు తీసింది. మ్యాచ్‌లో చేసిన ప్రదర్శనకు గానూ శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకుంది. అవార్డు తీసుకున్న అనంతరం శ్రీ చరణి మాట్లాడింది. 'నా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. మహిళల క్రికెట్ ఆడుతూ దేశానికి సేవ చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నా. అయితే ప్రతీ మ్యాచ్‌కు జట్టులోని స్పిన్నర్లమంతా ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకుంటాం. నాతో పాటు ప్రేమ రావత్, దీప్తి శర్మ, రాధా యాదవ్ కలిసి మ్యాచ్‌లో ఎలా బౌలింగ్ చేయాలనేది




చర్చించుకుంటాం. దీప్తి, రాధా దీదీలు చెప్పే ప్రతి సలహాను మైదానంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తాం. 50 వికెట్ల మార్క్‌కు ఒక్క వికెట్ దూరంలోఏ ఉన్నప్పటికీ, వాటిని నేను పట్టించుకోను. బౌలింగ్‌పైనే నా దృష్టంతా పెట్టాలనుకుంటున్నా. ఇక నాతో పాటు బౌలింగ్‌లో వికెట్లు తీసిన ప్రేమ రావత్‌కు కూడా మంచి భవిష్యత్తు ఉంది. ఆమెది సహజమైన ప్రతిభ. ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ సమానంగా ఉంటాయి. బౌలర్లకు సహకరించే వికెట్‌పై సుమారు 120 పరుగులు అనేది

# స్పోర్ట్స్

## పట్టువదలని విక్రమార్కులు.. తొలిసారి చైనా మాస్టర్స్ విజేతగా సాత్విక్ జోడీ..!

భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ఖాతాలో మరో టైటిల్ చేరింది. చైనా




మాస్టర్స్(జష్ట్రఱఅఖ మీఖర్వతీం) సెమీస్‌లో సంచలన విజయంతో ఫైనల్ చేరిన ఈ జోడీ.. ఆఖరి పోరులో చైనా జంటను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్‌పై అద్భుతం విజయంతో విజేతగా నిలిచింది సాత్విక్ -- చిరాగ్ జంట. తొలి సెట్ కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోకని భారత జోడీ వరసగా రెండు సెట్లలో గెలుపొందింది. దాంతో.. చైనా షట్లర్లకు నిరాశే మిగిలింది.

చైనా మాస్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం ఛాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్‌లో అంచనాలు అందుకుంటూ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జంట ధాటికి చైనా షట్లర్లు చేతులెత్తేశారు. తొలి సెట్‌ను 11-21తో కోల్పోయిన సాత్విక్ జోడీ ఒత్తిడికి లోనవ్వలేదు. రెండో సెట్‌లో గొప్పగా ఆడి హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్‌కు 21-13తో షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ భారత ద్వయం చెలరేగింది.

ఫలితంగా 21-17తో సెట్‌ను గెలుపొందడంతో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుందీ స్టార్ జోడీ. గతంలో రెండుసార్లు(2023, 2025) ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ చిరాగ్ .. ఈసారి తమ కలను సాకారం చేసుకుంటూ విజేతగా నిలిచారు. మొత్తంగా ఈసీజన్‌లో వీరికి ఇది రెండో టైటిల్. ఈమధ్యే ఈ జంట సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలిచింది.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710